

సేవల వినియోగం ఎంత?

కేయూ వివిధ విభాగాల్లో ప్రొఫెసర్ల కొరత కారణంగా గతంలో రిటైర్ అయిన వారిని అడ్జెంట్ ప్రొఫెసర్లుగా నియమించేందుకు పాలకమండలి ఆమోదించింది. - 8లో▸



రూ.10లక్షల విలువైన...

కాజీపేట రైల్వే జంక్షన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురి వద్ద 134 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే డీఎస్పీ మల్లారెడ్డి తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
36^0 / 18^0

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కొంతమేర పెరుగుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత కాస్త తగ్గుతుంది.

న్యూస్‌రీల్

నేడు కార్పొరేట్ విద్యాసంస్థలు బంద్

జనగామ రూరల్: హైదరాబాద్ నార్సింగిలోని శ్రీచైతన్య కళాశాలలో సాత్విక్ బలవన్మరనానికి నిరసనగా గురువారం జిల్లాలోని కార్పొరేట్ విద్యాసంస్థలు బంద్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎస్ యూఐ జిల్లా అధ్యక్షుడు చిలువురు అభిగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

యాదాద్రి జోన్‌లోకి సిద్ధేశ్వరాలయం

బచ్చన్నపేట: మండల పరిధి కొడవటూర్‌లోని శ్రీ సిద్ధేశ్వరాలయం పరిపాలనా విధులను యాదాద్రి జోన్‌లో నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ హైదరాబాద్ నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వంశీ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనగామ జిల్లా జోన్-5ను యాదాద్రి జోన్‌లో విలీనం చేశారని, ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా సహాయ కమిషనర్ పరిధిలో ఉన్న ఈ ఆలయం ఇక నుంచి యాదాద్రి జోన్‌లో కొనసాగుతుందని పేర్కొన్నారు.

సంపూర్ణ స్వచ్ఛత సాధించాలి

జనగామ రూరల్: ప్రతి ఒక్కరూ సంపూర్ణ స్వచ్ఛత సాధించాలని డీఆర్‌డీఓ రాంరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ భారత్ మిషన్ ఎస్‌బీఎం ఫేజ్-2 లో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా తయారు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హసీం, ఎస్‌బీఎం డీసీ కర్ణాకర్, ఎంపీఓ సంపత్‌కుమార్, ఎంపీఎం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వ్యవసాయ విద్యుత్ కోతలు

జనగామ: పట్టణంలోని చంపక్‌హిల్స్ 400కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం జిల్లా వ్యాప్తంగా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్యవసాయానికి సరఫరా చేసే త్రీఫేస్ విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణాలు, మున్సిపాలిటీ, మండల కేంద్రాలు, పల్లె ప్రాంతాల పరిధిలో గృహ, వాణిజ్య వినియోగదారులకు లైటింగ్ లోడ్ సప్లయ్ ఉంటుందని పేర్కొన్నారు. త్రీఫేస్ విద్యుత్ నిలిపి వేసిన సమయానికి సంబంధించి మరుసటి రోజు సరఫరా ఇస్తామని తెలిపారు.

కాంగ్రెస్‌కు 'గండ్ర' ద్రోహం: జంగా

జనగామ: రాజకీయ భిక్షపెట్టి.. ఎన్నో పదవులు కట్టబెట్టిన కన్నతల్లిలాంటి కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ద్రోహం చేయడమే కాకుండా.. అధికార అహంకారం ప్రదర్శిస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రకటన విడుదల చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా భూపాలపల్లిలో పర్యటిస్తుండగా గండ్ర దాడులు చేయించడం సిగ్గుచేటన్నారు. తన వ్యక్తిగత అవసరాల కోసం పార్టీని వీడి సొంత నియోజకవర్గం భూపాలపల్లిలో కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక తమ కార్యకర్తలపై భౌతిక దాడులు చేయిస్తూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. పోలీసులను అడ్డుపెట్టుకుని దాడులు చేసే సంస్కృతి కాంగ్రెస్‌కు లేదని, మేం తలుచుకుంటే మీరు రాజకీయలు చేయలేరని హెచ్చరించారు. ఇటువంటివి పునరావృతమైతే ఊరుకునేది లేదన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

జనగామ: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఉద్యోగులు నిరసన తెలిపారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జనగామ ఎన్పీడీసీఎల్ సూపరింటెండెంట్ కార్యాలయాల ఎదుట బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ కార్యవర్గ సభ్యుడు సునీల్‌రెడ్డి మాట్లాడుతూ గతం కంటే మెరుగైన ఫిట్‌మెంట్, ఆర్టిజన్ ఉద్యోగుల పర్సనల్ పే బేసిక్‌లో కలిపిన తర్వాత పే ఫిక్షన్ చేయాలని, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ ఖాతా లుగా మార్చడంతోపాటు సింగిల్ మస్టర్ స్కేల్ అమలు చేయాలన్నారు. యాజమాన్యం గతంలో రాతపూర్వకంగా అంగీకరించిన స్పెషల్ గ్రేట్ ఫోర్‌మెన్ పోస్టులను తక్షణమే మంజూరు చేసి దీర్ఘకాలికంగా సమస్యలు పరిష్కరించాలన్నారు.

ఐక్య పోరాటాలే శరణ్యం

జనగామ రూరల్: కేంద్రంలోని ప్రజావ్యతిరేక బీజేపీ సర్కారును గద్దె దించాలంటే ఐక్య పోరాటాలతోనే సాధ్యమని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులకు కేంద్రం ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని, సీసీఐకి నిధులు తగ్గించి పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలేదని, ఎరువుల సబ్సిడీ కుదించిందన్నారు. లేబర్ కోడ్ వల్ల పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తున్నారని, వీటన్నింటిని నిరసిస్తూ.. ఏప్రిల్ 5న ఢిల్లీలో భారీ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వెంకట్రాజం, కనకారెడ్డి, అహల్య, విజేందర్ పాల్గొన్నారు.

బియ్యం తరుగుకు చెక్

రేషన్ లబ్ధిదారులకు బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా చేసే బియ్యంలో తరుగు రాకుండా.. మరింత పారదర్శకత ఉండేలా చర్యలు చేపడుతోంది. ఈ మేరకు బియ్యం స్టాక్ కేంద్రాల వద్ద ఈ-పాస్ విధానం అమలు చేసి డీలర్ల బయోమెట్రిక్ పూర్తి చేసిన తర్వాతే వారి సమక్షంలో బియ్యం తూకం వేసి పంపించనున్నారు. ఇందుకు రాష్ట్రంలో జనగామతో పాటు మెదక్ జిల్లాను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయగా.. ఈ నెల నుంచి అమలు చేయదానికి సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.
- జనగామ



ఎంఎల్ఎస్ పాయింట్లలో ఈ-పాస్ విధానం

- డీలర్ల సమక్షంలోనే తూకం
- ఈ నెల నుంచి అమలులోకి..
- పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లా ఎంపిక



జనగామ ఎంఎల్ఎస్ పాయింట్ గోదాం

రాష్ట్రంలో చౌకధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు బయోమెట్రిక్ విధానంతో బియ్యం పంపిణీ చేస్తున్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ దందాను అరికట్టడానికి ఓటీపీ విధానం తీసుకువచ్చినా పెద్దగా ఫలితం లేకపోవండతో సర్కారు వేలిముద్ర పద్ధతిని అమలులోకి తీసుకువచ్చింది. రేషన్ వ్యవస్థలో సమూల మార్పులు చేస్తున్నా.. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి వచ్చే బస్తాల్లో బియ్యం తరుగును కంట్రోల్ చేయలేక పోయింది. తూకం వేయకుండానే బస్తాల లెక్కన డీలర్లకు బియ్యం పంపిస్తుండడంతో చిరిగిన గన్నీ బ్యాగులు.. రెండు, మూడు సార్లు లోడింగ్, అన్‌లోడింగ్‌తో ఒక్కో బస్తాలో ఒకటి నుంచి రెండు కిలోల వరకు బియ్యం తరుగు వస్తోంది. పౌరసరఫరాల శాఖ అధికారులు రేషన్ దుకాణాలను తనిఖీ చేసిన సమయంలో అమ్మకం, స్టాక్‌లో తేడా కనిపించడంతో డీలర్లపై కేసులు నమోదు చేస్తున్నారు. 'బయోమెట్రిక్ విధానం ద్వారానే బియ్యం పంపిణీ చేస్తున్నాం.. మా తప్పులేదని' డీలర్లు మొత్తుకున్నా వినిపించుకునే పరిస్థితి లేకుండా పోయింది.

జిల్లాలో రేషన్ వివరాలు	
రేషన్ దుకాణాలు	: 335
తెలుపు రేషన్‌కార్డులు	: 1,50,619
అంత్యోదయ	: 10,706
అన్నపూర్ణ	: 90
లబ్ధిదారులు	: 4,88,678
ప్రతి నెలా బియ్యం కోటా	: 2,046 టన్నులు

విధిలేని పరిస్థితుల్లో కోర్టుకు..

దీంతో విధిలేని పరిస్థితుల్లో డీలర్లు కోర్టును ఆశ్రయించారు. కోర్టు సూచన మేరకు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బయోమెట్రిక్ విధానం ద్వారానే రేషన్ దుకాణాలకు బియ్యం పంపించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి రెండు నెలల క్రితం ట్రయల్ రన్ నిర్వహించగా.. పలు సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వాటిని సరిచేసి ఈ నెల నుంచి జనగామ, మెదక్ జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలుకు శ్రీకారం చుట్టింది. ఇక నుంచి ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి ప్రతీ నెల డీలర్ వేలిముద్ర(బయో మెట్రిక్)తో రేషన్ దుకాణానికి బియ్యం సరఫరా చేస్తారు. ఇందుకు సంబంధించి ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎలక్ట్రానిక్ కాంటాలకు ఈ-పాస్ యంత్రాలు బిగించారు.

తూకంలో ఆలస్యానికి అవకాశం

ప్రతి నెలా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రోజుకు వెయ్యి నుంచి 1500 క్వింటాళ్ల వరకు రేషన్ దుకాణాలకు బియ్యం పంపించే వారు. ప్రస్తుతం బయోమెట్రిక్ విధానం అమలులోకి వస్తుండడంతో.. రోజుకు కేవలం 300 క్వింటాళ్ల బియ్యమే కాంటా వేసే అవకాశం ఉంటుందని అంటున్నారు. తరలింపులో వేగం తగ్గకుండా సమస్యను అధిగమించడానికి వేబ్రిడ్జి ఒక్కటే పరిష్కారమార్గమని పలువురు డీలర్లు అభిప్రాయపడుతున్నారు.

మూడు ఎంఎల్ఎస్ పాయింట్లు..

జనగామ చంపక్‌హిల్స్, స్టేషన్‌ఘన్‌పూర్, కొడకండ్లలో మండల స్థాయి ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంలు ఉన్నాయి. వీటికి బచ్చన్నపేట, జనగామ, దేవరుప్పుల, నర్మెట, యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు, భువనగిరి బఫర్ గోదాంల నుంచి స్టేజ్-1 కాంట్రాక్టర్ బియ్యం సరఫరా చేస్తారు. ఇక్కడి నుంచి స్టేజ్-2 కాంట్రాక్టర్ రేషన్ దుకాణాలకు కేటాయింపుల ఆధారంగా పంపిస్తారు. జిల్లాలో మొత్తం రేషన్ దుకాణాలు 335 ఉండగా.. ప్రతి నెలా 2,046.455 టన్నుల సబ్సిడీ బియ్యం పంపిణీ చేస్తున్నారు. 1,61,415 రేషన్ కార్డుల ద్వారా 4,88,678 మంది లబ్ధిదారులు ఉచిత బియ్యం పొందుతున్నారు.

మరింత పారదర్శకత



ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ డీలర్లకు బియ్యం పంపించే సమయంలో బయోమెట్రిక్ విధానంతో మరింత పారదర్శకత ఉంటుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాను ఎంపిక చేసింది. ప్రతి నెలా డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్ వద్దకు వెళ్లి వేలిముద్ర వేసి బియ్యం తీసుకుపోవాలి. పంపిణీలో స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలి.
- సీహెచ్.శివలింగయ్య, కలెక్టర్

ఎట్టకేలకు సిగ్నలింగ్ వ్యవస్థ

- ఆర్టీసీ చౌరస్తాలో పునరుద్ధరణకు చర్యలు
- రూ.18లక్షల వ్యయంతో పనులు

జనగామ: జిల్లా కేంద్రం ఆర్టీసీ చౌరస్తాలో మూడేళ్ల సుదీర్ఘ కాలం తర్వాత ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ పునఃప్రారంభమవుతోంది. రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో గతంలో ఉన్న సిగ్నల్ పాయింట్లను తొలగించిన విషయం తెలిసిందే. సుందరీకరణ పనులు 90 శాతం పూర్తి కాగా నిధుల లేమితో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్య పోలీసులకు తలనొప్పిగా మారింది.

వ్యాపార కేంద్రంగా పట్టణం

వ్యాపార కేంద్రంగా మారిన జనగామ పట్టణానికి జిల్లా నలుమూలలతో పాటు సమీప జిల్లాలకు చెందిన వారు వ్యాపార, వాణిజ్య పరంగా వస్తారు. దీంతో ఆర్టీసీ చౌరస్తా నుంచి నెహ్రూపార్కు, రైల్వేస్టేషన్, స్వర్ణకళా మందిర్ రోడ్లు ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు రద్దీగా ఉంటాయి. జిల్లా ఆవిర్భవించిన తర్వాత పట్టణంలో ట్రాఫిక్ పదింతలు పెరిగింది. ఉత్తర, దక్షిణ రాష్ట్రాలను కలిపే రైల్వే మార్గం, వరంగల్-హైదరాబాద్ ప్రధాన జాతీయ రహదారి కావడంతో ప్రయాణికుల రద్దీ కూడా విపరీతంగా ఉంటుంది. సిగ్నలింగ్ వ్యవస్థ లేకపోవడం, ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ మంజూరు చేసినా సేవలు అందుబాటులోకి రాకపోవడంతో స్థానిక పోలీసులపై ఒత్తిడి పెరిగింది. దీంతో ఎలాగైనా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలనే సంకల్పంతో నిధుల సేకరణకు పోలీసు శాఖ అధికారులు పురపాలికతో పాటు కలెక్టర్‌ను సంప్రదించారు.



ట్రాఫిక్ సిగ్నల్స్ సామగ్రిని పరిశీలిస్తున్న ఏసీపీ

రూ.18లక్షలతో సిగ్నల్ వ్యవస్థ

ఆర్టీసీ చౌరస్తాలో సిగ్నల్స్ ఏర్పాటుకు కలెక్టర్ సీడీపీ నిధుల నుంచి రూ.8 లక్షలు, మున్సిపల్ రూ.10లక్షలు మొత్తం రూ.18 లక్షలు మంజూరు చేశారు. సిద్దిపేట, సూర్యాపేట, హైదరాబాద్, హనుమకొండ నాలుగు రోడ్ల దిక్కున ట్రాఫిక్ సిగ్నల్స్‌తో పాటు వాటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. కొద్ది రోజుల్లో ట్రాఫిక్ సిగ్నల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు సంబంధించి ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఏఈ మహిపాల్ ఆధ్వర్యాన ఆర్టీసీ చౌరస్తాలో ఏర్పాటు చేయనున్న సిగ్నల్స్‌ను బుధవారం పరిశీలించారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సిగ్నల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. సిగ్నల్స్‌తో పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుంది. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. అతిక్రమిస్తే జరిమానాలు, చర్యలు తప్పవు.
- దేవేందర్‌రెడ్డి, ఏసీపీ

కేంద్రంపై పోరుబాట

- నేడు, రేపు జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు
- జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి

జనగామ: కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ సిలిండర్ల ధరలు మరోసారి పెంచి పేదల నడ్డి విరుస్తోందని జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి అన్నారు. జెడ్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అదానీ నష్టాలను పూడ్చేందుకు ఇలా ప్రజల నుంచి అడ్డదారిలో దోచుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం(నేడు) నియోజకవర్గ కేంద్రాలు, 3న జిల్లా కేంద్రం, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోకల శివకుమార్, జనగామ పీఏసీఎస్ చెర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరగోని యాదగిరి, మహిళా అధ్యక్షురాలు రేఖరాజు, కౌన్సిలర్ బండ పద్మయాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

మొక్కుబడిగా ఉద్యోగ విరమణ వేడుకలు

దేవుడి ముందు అందరూ సమానులే..

- త్రిదండి చిన జీయర్‌స్వామి

- వివరాలు 10లో▸

తుపాకీ రాముళ్ల మాటలు నమ్మొద్దు

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

లింగాలఘణపురం: కాంగ్రెస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ తుపాకీ రాముళ్ల మాదిరిగా మాట్లాడుతున్నారు.. వారి మాటలు నమ్మొద్దని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధి నేలపోగుల గ్రామంలో సీసీ రోడ్డు, 'మనఊరు-మనబడి' పనులను ప్రారంభించిన అనంతరం సర్పంచ్ గణపతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్.. గోదావరి జలాలతో చెరువులను నింపుతున్నాడని పేర్కొన్నారు. అన్నదాతకు అండగా నిలవడానికి పెట్టుబడి సాయం, రైతు బంధు, అలాగే పేదింటి ఆడబిడ్డలను కల్యాణలక్ష్మితో ఆదుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దడానికి 'మనఊరు-మనబడి' కార్యక్రమం కింద రూ.వేల కోట్లు వెచ్చిస్తున్నట్లు వివరించారు. బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్‌లో రూ.700 పింఛన్ ఇస్తే తెలంగాణలో రూ.2వేలు ఇస్తున్నామని చెప్పిన మంత్రి.. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని ప్రశ్నించారు. అప్పుడు చేయనోళ్లు ఇప్పుడు చేస్తామని పిచ్చికుక్కల్లా బేమాన్ మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నేలపోగుల పాఠశాల అభివృద్ధికి ఎస్ఆర్ఐ లక్ష్మీనారాయణ రూ.కోటి వరకు విరాళంగా ఇచ్చారని, ఆయన సేవలను అభినందించాలని కోరారు.




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సర్పంచ్ గణపతి కోరగా రూ.2కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజయ్య, కలెక్టర్ శివలింగయ్య, డీఈఓ రాము, ఎంపీపీ జయశ్రీ,, జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి, పీఆర్ ఈఈ చంద్రశేఖర్, నీటిపారుదల ఈఈ ప్రవీణ్‌కుమార్, డీఈలు రవీందర్, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.


లగ్నపత్రికతోనే కల్యాణలక్ష్మి పథకం

దేవరుప్పుల: లగ్నపత్రికతోనే పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం వర్తింపజేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు తోడ్పాటు అందించాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచించారు. బుధవారం మండల పరిధి భార్గవి గార్డెన్‌లో పార్టీ మండల నాయకుడు మరాఠి యాదగిరి, అండాలు కుమారుడు సురేష్, నవ్య వివాహానికి హాజరైన మంత్రి ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు కానుకలు అందించి ఆశీర్వదించారు. దయాకర్, రవి, సుందర్‌రామిరెడ్డి, మొలుగూరి రమేష్, మరాఠి కృష్ణ, యాదవరెడ్డి, సోమయ్య. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలి



నాయకులను లాక్కెళ్తున్న పోలీసులు



ప్రీతి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న సోమయ్య

- ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా
- పోలీసులు, నాయకుల మధ్య తోపులాట

జనగామ రూరల్: మెడికల్ పీజీ విద్యార్థిని డాక్టర్ ప్రీతి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించి, ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ జనగామ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా.. పోలీసులు, నాయకుల మధ్య తోపులాట చోటుచేసుకుని పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ సందర్భంగా ఏబీవీపీ వరంగల్ విభాగ్ కన్వీనర్ చింతకింది సంతోష్ మాట్లాడుతూ.. కళాశాలలో ర్యాగింగ్ జరుగుతుంటే హెచ్ఓడీ పట్టించుకోకపోవడం వల్లే ఇంతటి దారుణం జరిగిందన్నారు. ఇందుకు హెచ్ఓడీ నైతిక బాధ్యత వహించాలని, రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేలా ప్రత్యేక కమిటీ వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట హృతిక్‌సాయి, పొన్నాల రమేష్, అరవింద్, పోతుల నరేష్, నవీన్, శివ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు పరామర్శ

కొడకండ్ల: ప్రీతి కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర నాయకుడు, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెదగాని సోమయ్య బుధవారం గిర్నితండాలో పరామర్శించారు. ఈ సందర్భంగా నరేందర్-శారద దంపతులను ఓదార్చారు. ప్రీతి బంగారు భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసిన పాపం కేసీఆర్ ప్రభుత్వానిదేనని, సమాజం ఒక మంచి డాక్టర్‌ను కోల్పోయిందని అన్నారు. ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి సైఫ్‌ను దిశ తరహాలోనే ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థులకు రక్షణ కల్పించలేని మంత్రి హరీశ్‌రావు రాజీనామా చేయాలని, ప్రీతి కుటుంబానికి రూ.2 కోట్లు పరిహారం, ఇంట్లో ఇద్దరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని చెప్పారు. కోటేశ్వర్‌రావు, రాంమ్మోహన్‌రెడ్డి, ఉపేందర్, కుమార్, సురేష్, రాయుడు, అజయ్ ఉన్నారు.

సమస్యలకు చావు పరిష్కారం కాదు



లయన్స్ ప్రాంతీయ వేడుకల్లో పాల్గొన్న మోటివేటర్ నాగేశ్వరావు, లయన్ ప్రతినిధులు

జనగామ: జీవితంలో కష్టాలు, నష్టాలు, సమస్యలు వస్తూనే ఉంటాయి.. ఆ సమసయంలో మనోధైర్యంతో ఎదుర్కోవాలే తప్ప.. చావుతో పరిష్కారం కావని ప్రముఖ మోటివేటర్ నాగేశ్వరరావు అన్నారు. జనగామ మండలం పసరమడ్ల శివారు ఉషోదయ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన లయన్స్ ప్రాంతీయ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో యువత క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని పేర్కొన్నారు. మనసులో కలిగే బాధతో కుమిలి పోకుండా తల్లిదండ్రులు, స్నేహితులతో పంచుకుంటే ఊరటలభిస్తుందని, నిండు జీవితాన్ని పాడుచేసుకోవద్దని సూచించారు. ఇప్పటి వరకు తమ కౌన్సిలింగ్ ద్వారా 250 మంది యువకులను ఆత్మహత్య చేసుకోకుండా నివారించగలిగామని చెప్పారు. డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్‌కుమార్ సేవా కార్యక్రమాలు చేపడుతూ రీజియన్ చైర్మన్ స్థాయికి ఎదిగారని, ఈ సందర్భంగా ఆయనను అభినందించారు. కార్యక్రమంలో లయన్ ప్రతినిధులు నాగబండి రవీందర్, అల్లాడి ప్రభాకర్, చంద్రగిరి ప్రసాద్, యాదగిరి, టి.వెంకట్, పెద్దివెంకట నారాయణగౌడ్, వై.సంజీవరెడ్డి, కృష్ణజీవన్ బజాజ్, ముత్యాల అరుణ, బొల్లికొండ హనుమంతు, పజ్జూరి గోపయ్య, మార్యాల అశోక్ , మోహన్ రెడ్డి, ,ఉప్పలయ్య, చీదురాల బాబు, సముద్రాల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'బండ' మరింత బరువు

- సబ్సిడీ సిలిండర్‌పై రూ.50 వడ్డన
- 27 నెలల వ్యవధిలో రూ.426.50 పెంపు
- జిల్లాలో 1.70లక్షల వరకు సబ్సిడీ కనెక్షన్లు



జనగామ: సబ్సిడీ సిలిండర్‌పై రూ.50 పెంచిన కేంద్రం పేద కుటుంబాలపై మరోమారు భారం మోపింది. 27 నెలల వ్యవధిలో సబ్సిడీ సిలిండర్ ధర రూ.426.50 పైసలు పెరిగింది. అయితే కేంద్రం ఇచ్చే సబ్సిడీ మాత్రం రూ.40కి తగ్గించింది. దీంతో దీపం, ఉజ్వల పథకాల లబ్ధిదారులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. ఇక కమర్షియల్ సిలిండర్ ధర సైతం రికార్డు స్థాయిలో పెరగడం ఫుట్‌పాత్ వ్యాపారం చేసుకునే కుటుంబాలకు భారంగా మారింది.

1.70లక్షల సబ్సిడీ కలెక్షన్లు

జిల్లాలో ఐఓసీ, బీపీఎల్, హెచ్‌పీసీఎల్ కంపెనీలకు చెందిన 12 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. జనరల్, ఉజ్వల, దీపం, సీఎస్ఆర్ కేటగిరీల్లో సుమారు 1.70లక్షల వరకు సబ్సిడీ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. 2020 డిసెంబర్‌లో రూ.695 ఉన్న సబ్సిడీ సిలిండర్ ధర 2023 వచ్చే సరికి రూ.1,157.50కి పెరిగింది. ప్రస్తుతం జిల్లాలో రూ.1,107.50 ధరతో విక్రయిస్తున్న సబ్సిడీ సిలిండర్.. రూ.50 పెరగడంతో రూ.1,157.50 వసూలు చేస్తున్నారు.


రికార్డు స్థాయిలో కమర్షియల్ ధరలు

జిల్లాలో 2,800 వరకు కమర్షియల్ సిలిండర్లు ఉన్నాయి. హోటళ్లు, ఫుట్‌పాత్ వ్యాపారంతో పాటు వివిధ పరిశ్రమల్లో వీటిని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.1,978.50 ఉండగా కేంద్రం రూ.350 పెంచింది. దీంతో రూ.2,328.50 ధరతో విక్రయిస్తున్నారు. దీంతో రోజువారి వ్యాపారం చేసుకునే చిన్నా, చితకా కుటుంబాలు గ్యాస్‌కు నెలకు రూ.700 అదనంగా వెచ్చించాల్సి వస్తుంది.




పక్క ఫొటోలోని మహిళ పేరు గుర్రం ప్రమీల. స్టేషన్ ఘన్‌పూర్ మండలం శివునిపల్లికి చెందిన ఈమె కుటుంబంలో నలుగురు సభ్యులు ఉంటారు. రోజువారీ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో వచ్చే అరకొర ఆదాయంతో నెట్టుకొస్తున్నారు. ఇప్పటికే పెరిగిన గ్యాస్ ధరలు, సబ్సిడీ సొమ్ము తగ్గించడంతో పొదుపుగా వాడుకుంటున్నారు. ఈ క్రమంలో మరోసారి గ్యాస్‌కు రూ.50 పెంచడంతో 'ఇక కట్టెల పొయ్యే దిక్కు' అంటూ ప్రమీల నిట్టూర్చింది.

నెలకు రూ.3,850 భారం



పట్టణంలోని ఆర్టీసీ చౌరస్తాలో వి.ప్రవీణ్ టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ప్రతి నెలా కమర్షియల్ సిలిండర్లు 11 కొనుగోలు చేస్తున్నాడు. ప్రస్తుతం ఒక్కో సిలిండర్‌పై పెరిగిన రూ.350తో నెలవారీగా రూ.3,850 భారం పడుతుంది. సిలిండర్ల ధరలు వరుసగా పెరుగుతుండడంతో వచ్చే లాభం వీటికే సరిపోతోందని, నిర్వహణ కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశాడు.

గ్యాస్ ధరలు తగ్గించాలి



కేంద్ర ప్రభుత్వం పెంచిన సబ్సిడీ, కమర్షియల్ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి. దేశ ప్రజలపై భారం మోపుతున్న ప్రధాని మోదీ రాజీనామా చేయాలి. నష్టాల బాటపట్టిన అదానీ గ్రూపుపై చర్యలు తీసుకోలేక పేద కుటుంబాలపై భారం వేస్తూ దోచుకుంటున్నారు. జిల్లాలో అన్ని వర్గాల ప్రజలు రోడ్డుపైకి వచ్చి నిరసన తెలపాలి.
- సీహెచ్.రాజారెడ్డి, మాజీ ఎమ్మెల్యే

క్లుప్తంగా

శ్రీనివాస్‌రావుకు ప్రొఫెసర్‌గా పదోన్నతి


ఉత్తర్వులను వీసీ, రిజిస్ట్రార్‌ల నుంచి స్వీకరిస్తున్న శ్రీనివాస్‌రావు

కేయూ క్యాంపస్‌: కేయూ పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌ అండ్‌ హ్యూమన్‌ రిసోర్స్‌ మేనేజ్‌మెంట్‌ అసోసియేట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ పి.శ్రీనివాస్‌రావుకు ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించారు. బుధవారం ఈమేరకు కేయూ వీసీ తాటికొండ రమేశ్‌, రిజిస్ట్రార్‌ టి.శ్రీనివాస్‌రావు ఉత్తర్వులను శ్రీనివాస్‌రావుకు అందజేశారు. పి.శ్రీనివాస్‌రావు 2008లో ఆ విభాగంలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. 20 20లో అసోసియేట్‌ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. విశ్వవిద్యాలయంలో డిఫెరెంట్లీ ఎబుల్డ్‌ సెల్‌ సంచాలకులుగా, కేయూ అడ్మిషన్ల డైరెక్టరేట్‌ సంయుక్త సంచాలకులుగా, పబ్లిక్‌ అ డ్మినిస్ట్రేషన్‌ అండ్‌ హ్యూమన్‌ రిసోర్స్‌ మేనేజ్‌మెంట్‌ విభాగం అధిపతిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆయన ఆవిభాగానికి బోర్డ్‌ ఆఫ్‌ స్టడీస్‌ చైర్మన్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు.

ఐదుగురిపై చీటింగ్‌ కేసు


ఫోర్ట్‌రోడ్డు ఇసుక అడ్డా జంక్షన్‌లో వాహన తనిఖీ

ఖిలావరంగల్‌: నంబర్‌ ప్లేట్లు లేకుండా ద్విచక్ర వాహనాలను నడిపిస్తున్న ఐదుగురు వాహనదారులపై చీటింగ్‌ కేసు నమోదు చేసి మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ బాబులాల్‌ తెలిపారు. బుధవారం వరంగల్‌ ఫోర్ట్‌ రోడ్డు ఇసుక అడ్డా జంక్షన్‌లో ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ బాబులాల్‌ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ ఎస్సైలు రామారావు, రాజబాబు, డేవిడ్‌ నేతృత్వంలో వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో బైక్‌లకు నంబర్‌ ప్లేట్‌ లేకుండా తిరుగుతున్న ఐదుగురు వాహనదారులను గుర్తించారు. వారి వాహనాలను సీజ్‌ చేసి చీటింగ్‌ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సేవల వినియోగం ఎంత?

- అడ్జెంట్‌ ప్రొఫెసర్లకు విధివిధానాలేవి?
- నిబంధనలకు విరుద్ధమని గవర్నర్‌, యూజీసీ చైర్మన్‌కు ఫిర్యాదు

కేయూ క్యాంపస్‌: కేయూలో వివిధ విభాగాల్లో ప్రొఫెసర్ల కొరత కారణంగా గతంలో రిటైర్డ్‌ అయిన వారిని అడ్జెంట్‌ ప్రొఫెసర్లుగా నియమించేందుకు కేయూ పాలకమండలి సమావేశంలో ఆమోదించింది. నెలక్రితం కేయూలోని వివిధ విభాగాల్లో 12 మంది అడ్జెంట్‌ ప్రొఫెసర్లను యూనివర్సిటీ అధికారులు నియమించారు. యూజీసీ నిబంధనల మేరకు నియామకాలు జరగలేదని హైదరాబాద్‌కు చెందిన ఒకరు గవర్నర్‌ తమిళిసై, యూజీసీ చైర్మన్‌ మామిడాల జగదీశ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కాగా.. నియామకమైన వారి సేవలను ఎంత వరకు వినియోగించుకుంటున్నారనే ప్రశ్న తలెత్తుతోంది.

నిబంధనలేం చెబుతున్నాయంటే..

యూజీసీ నిబంధనల ప్రకారం.. దరఖాస్తుల్ని ఆయా విభాగాల అధిపతుల ద్వారా, రిజిస్ట్రార్‌కు ఫార్వర్డ్‌ చేయాలి. అనంతరం సెలక్షన్‌ కమిటీ ద్వారా ఎంపిక చేయాలి. కాగా.. అడ్జెంట్‌ ప్రొఫెసర్ల దరఖాస్తులను విభాగాల అధిపతులు ఫార్వర్డ్‌ చేయలేదని తెలుస్తోంది. సెలక్షన్‌ కమిటీ కూడా వేయలేదనే విమర్శలున్నాయి. ఇదే విషయమై ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. కాగా.. అడ్జెంట్‌ ప్రొఫెసర్ల నియామకాల్లో ఇష్టారాజ్యంగా వీసీ వ్యవహరించారనే ఆరోపణలున్నాయి.



విధివిధానాలేవి?

12 మంది అడ్జెంట్‌ ప్రొఫెసర్లకు ఏం బోధించాలి, టైం టేబుల్‌, ఏమీ చెప్పలేదు. అటెండెన్స్‌ రిజిస్టర్‌ కూడా ఏర్పాటు చేయలేదు. విధివిధానాలేమీ లేకపోవడంతో ఆయా అడ్జెంట్‌ ప్రొఫెసర్లు ఇష్టం ఉన్నప్పుడు వచ్చి వెళ్తున్నారనే ఆరోపణలున్నాయి. కాగా.. వీరికి ఒక్కొక్కరికి ప్రతినెలా రూ.50 వేలు వేతనం ఇస్తున్నారు. వీరికి రిటైర్డ్‌ పింఛను కూడా వస్తోంది. కానీ వీరి సేవలను సరిగ్గా వినియోగించుకోకపోవడంతో వీరికిచ్చే వేతనాలు వృథా అనే విమర్శలున్నాయి. వీరి సేవల్ని వినియోగించుకోవడంలో యూనివర్సిటీ అధికారులు విఫలమైనట్లు తెలుస్తోంది.

ప్రొఫెసరే కాదు.. అడ్జెంట్‌ ప్రొఫెసర్‌ ఎలా?

12 మందిలో ఒకరు ప్రొఫెసర్‌కాని వారిని ఇప్పుడు అడ్జెంట్‌ ప్రొఫెసర్‌గాను, మరొకరికి డాక్టరేట్‌ లేకున్నా.. ఆయనను అడ్జెంట్‌ ప్రొఫెసర్‌గా నియమించారు. ఆయన పరిశోధనే చేయనప్పుడు పరిశోధక విద్యార్థులకు ఎలా సలహాలిస్తారనే ప్రశ్నతలెత్తుతోంది. ఇంకొకరు ప్రొఫెసర్‌ అయినప్పటికీ కేవలం ఆయన సర్వీస్‌లో ఒక్కరికే పీహెచ్‌డీ పర్యవేక్షకుడిగా చేశారు. మరొకరు 70 ఏళ్ల వయస్సు ఉన్న రిటైర్డ్‌ ఆచార్యుడికి కూడా అడ్జెంట్‌ ఆచార్యులుగా అవకాశం ఇవ్వటమేమిటనే చర్చ జరుగుతోంది. మూడు విభాగాల్లో నలుగురు రిటైర్డ్‌ ఆచార్యులు ఉచితంగానే కొంతకాలంగా క్లాస్‌లు చెబుతున్నారు. వారిని అడ్జెంట్‌ ఆచార్యులుగా ఎందుకు నియమించలేదనే ప్రశ్న తలెత్తుతోంది.

నిబంధనలు పాటించలేదు

కేయూలో అడ్జెంట్‌ ఆచార్యులను నియమించడాన్ని స్వాగతిస్తున్నాం. 12 మంది నియామకాల్లో యూజీసీ నిబంధనలు పాటించలేదు. కొందరు ఆచార్యులు రిటైర్డ్‌ అయినప్పటికీ ఎలాంటి భత్యం తీసుకోకుండా టీచింగ్‌, పరిశోధన మీద మక్కువతో ఇప్పటికీ విద్యార్థులకు సలహాలు, సూచనలిస్తున్నారు. అలాంటి వారిని గుర్తించి విభాగాల అధిపతులతో చర్చించి నియమాకం చేస్తే బాగుండేది. నియమించిన వారి సేవలను సైతం సరిగ్గా వినియోగించుకోవడం లేదు. దీంతో వర్సిటీ ధనం వృథా అయినట్లే.

– డాక్టర్‌ మామిడాల ఇస్తారి, అకుట్‌ జనరల్‌ సెక్రటరీ

యాసిడ్‌ పోసి తగలబెడతా..

- చికెన్‌ అప్పు ఇవ్వనందుకు ఆగంతకుడి బెదిరింపు


బైక్‌ సీట్‌కు గుచ్చిన కత్తి, మెమోరీ కార్డు

కాశిబుగ్గ: 'ఎక్కడ్నుంచో వచ్చావ్‌. చికెన్‌ ఉద్దెరడిగితే ఇయ్యనంటావ్‌రా.. డ్రామాలు చేస్తున్నావా వారం నుంచి నీకోసం దేవులాడుతున్నా.. పెద్దమ్మగడ్డ మోరీ దాటనియ్యం. నువ్వైతే షాపుకు రా యాసిడ్‌ పోసి తగలబెడతా' అంటూ ఓ గుర్తు తెలియని వ్యక్తి దుర్భాషలాడుతూ రికార్డు చేసి మెమోరీలో వేసి పంపిన ఆడియో కాశిబుగ్గలో బుధవారం కలకలం రేపింది. హనుమకొండ జిల్లా కమలాపురం మండలం శనిగరం గోపాల్‌పూర్‌కు చెందిన మామిడాల మధుకర్‌ కుటుంబంతో కలిసి తొమ్మిది నెలలుగా కాశిబుగ్గలోని ఓ ఇంట్లో అద్దెకుంటున్నాడు. హనుమకొండ అలంకార్‌ జంక్షన్‌ సమీపంలో వెరైటీ చికెన్‌ షాపులో సూపర్‌వైజర్‌ పని చేస్తున్నాడు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తి చికెన్‌ షాప్‌నకు వచ్చి చికెన్‌ ఉద్దెర అడిగితే మధుకర్‌ ఇవ్వనన్నాడు. దీంతో ఆగంతకుడు మంగళవారం అర్ధరాత్రి కాశిబుగ్గలోని మధుకర్‌ ఇంటికి వచ్చి పార్క్‌ చేసి ఉన్న బైక్‌ సీట్‌పై కత్తితో గుచ్చి ఆ కత్తికి ఆడియో రికార్డు చేసిన మెమోరీ కార్డును తగిలించాడు. ఎలాంటి ఆధారాలు దొరకొద్దని వైట్‌ పెయింట్‌ పోశాడు. ఉదయం అది చూసిన మధుకర్‌ భయాందోళనతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వరి నాటుపై గడ్డి మందు పిచికారీ



ఖానాపురం: మండలంలోని రంగాపురంలో వరినాటుపై గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేశారు. బాధితుడి వివరాల ప్రకారం.. చెన్నారావుపేట మండలం గొల్లభామ తండాకు చెందిన ఆంగోతు వెంకన్న రంగాపురం శివారులో ఆకుల స్వామికి చెందిన రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని నాటు వేశాడు. నెల రోజుల వరి నాటుపై గుర్తు తెలియని వ్యక్తులు రెండ్రోజుల క్రితం గడ్డి మందు పిచికారీ చేశారు. దీంతో పంట ఎండిపోతోంది. మంగళవారం సాయంత్రం వెళ్లి చూడగా.. పంట ఎండిపోయింది. పంట నాశనం చేసిన వ్యక్తులను గుర్తించి న్యాయం చేయాలని వెంకన్న పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు.

విద్యార్థి మృతదేహం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కొమురయ్య

కురవి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి ఉల్లేందుల మురళి(12) మంగళవారం కాలువలో పడి గల్లంతు కాగా.. బుధవారం అతడి మృతదేహం లభ్యమైనట్లు కురవి ఎస్సై రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు జిల్లా ఉన్నతాధికారులు మురళి కోసం గాలింపు చేపట్టినా.. ఫలితం లేకుండా పోయింది. బుధవారం ఉదయం నుంచి కాలువలో గాలింస్తుండగా మండలంలోని మోద్దులగూడెం శివారు బేగావత్‌ తండా సమీపంలోని ఎస్సారెస్పీ కాలువలో డ్రాప్‌ వద్ద తాటి మొద్దులు అడ్డుగా ఉండడంతో తాటి మొద్దులకు తగిలి మురళి మృతదేహం ఆగింది. కాలువలో లభ్యమైన మృతదేహాన్ని ఆర్డీఓ కొమురయ్య, డీఈఓ రామారావు, తహసీల్దార్‌ ఇమ్మానీయేల్‌, ఎస్సై రాము, ఏఎస్సై సదయ్య బయటకు తీశారు. విద్యార్థి తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మహబూబాబాద్‌ జనరల్‌ ఆస్పత్రికి తరలించినట్లు కురవి ఎస్సై రాము తెలిపారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి కురవి హైస్కూల్‌ తరఫున రూ.15 వేలను మృతుడి కుటుంబీకులకు అందించారు. తిర్మాలాపురంలో అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు జరిగాయి. బీఆర్‌ఎస్‌ యూత్‌ నియోజకవర్గ నాయకుడు డీఎస్‌ రవిచంద్ర బాధిత కుటుంబీకులకు రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. విద్యార్థి మృతితో తిర్మాలాపురంలో విషాదం అలుముకుంది.

షార్ట్‌ సర్క్యూట్‌తో అంబులెన్స్‌ దగ్ధం



ఎస్‌ఎస్‌ తాడ్వాయి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం అర్ధరాత్రి షార్ట్‌ సర్క్యూట్‌తో 108 అంబులెన్స్‌ దగ్ధమైంది. తాడ్వాయి పీహెచ్‌సీకి చెందిన అంబులెన్స్‌లో పేషెంట్‌ను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి తిరిగి రాత్రి 12 గంటల సమయంలో తాడ్వాయి పీహెచ్‌సీలో నిలిపారు. తెల్లవారు జామున 3 గంటల సమయంలో శబ్దం రావడంతో పక్కనే ఉన్న ఆస్పత్రి క్వాటర్స్‌లో నిద్రిస్తున్న ఈఎంటీ, పైలెట్‌లు బయటకు వచ్చారు. అంబులెన్స్‌కు మంటలు అంటుకుని కాలిపోతుండగా.. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేందుకు యత్నించారు. అప్పటికే ఇంజన్‌ ముందు భాగం పూర్తిగా కాలిపోయింది. ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్‌ శివకుమార్‌, ములుగు, జయశంకర్‌ భూపాలపల్లి ఉమ్మడి జిల్లా ఈఎంఈ నరేశ్‌, ఎస్‌సీ నరేశ్‌లు పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకటేశ్వరరావు అంబులెన్స్‌ను పరిశీలించి సిబ్బందిని విచారించారు.

రూ.10 లక్షల విలువైన గంజాయి పట్టివేత


కాజీపేట: పట్టుకున్న గంజాయిని చూపిస్తున్న డీఎస్పీ మల్లారెడ్డి, సిబ్బంది

కాజీపేట: కాజీపేట రైల్వే జంక్షన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న అయిదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 134 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే డీఎస్పీ మల్లారెడ్డి తెలిపారు. రైల్వే జంక్షన్‌ ఆవరణలోని డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం ఐదుగురు అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. సోదాలు నిర్వహించగా.. బ్యాగుల్లో గంజాయి బండిల్స్‌ లభించాయి. దీని విలువ దాదాపు రూ.10లక్షలు ఉంటుందని అంచనా. సంజయ్‌ అరుణ్‌ షిండే, రామ్‌ అర్జున్‌ షిండే, నిఖిల్‌ నందకుమార్‌ ఘువాళి, మనీశ్‌ దినేశ్‌ సావంత్‌, నజీరున్‌ మునజీర్‌ ఖాన్‌లను అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు పంపించారు. చాకచక్యంగా వ్యవహరించి గంజాయిని పట్టుకున్న సిబ్బందిని డీఎస్పీ మల్లారెడ్డి అభినందించారు. ఈసమావేశంలో సీఐ రామ్మూర్తి, ఎస్‌.అశోక్‌ కుమార్‌, దయాసాగర్‌, జె.శ్రీనివాస్‌, ఎం.రజిత పాల్గొన్నారు.

తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్‌

వరంగల్‌/రామన్నపేట: నగరంలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ డాక్టర్‌ ఎం.జితేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చార్‌బౌళికి చెందిన దాసరి సాయిరాం, హైదరాబాద్‌కు చెందిన తూము వినయ్‌ స్నేహితులు. వారు గతేడాది నుంచి గంజాయి విక్రయిస్తూ, సేవించడం అలవాటు చేసుకున్నారు. ఒడిశాలోని కలిమెలలో గంజాయి సరఫరాదారు మొద్దు అలియాస్‌ బాయ్‌తో పరిచయం ఏర్పరచుకున్నారు. అతడి నుంచి గంజాయి కొంటూ స్థానికంగా విక్రయిస్తున్నారు. వీరిద్దరూ భద్రాచలం మీదుగా తరచూ బైక్‌పై కలిమెలకు వెళ్తున్నారు. కలిమెల నుంచి 4 కిలోల గంజాయి కొని వరంగల్‌ వస్తూ కొంత విక్రయించారు. ముందుగా అందిన పక్కా సమాచారంతో వరంగల్‌ పోలీసు కమిషనర్‌ ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్‌ పోలీసు బృందం ఇంతేజార్‌గంజ్‌ పోలీసులతో కలిసి దాడి చేసింది. వారు గంజాయి అమ్ముతున్న, సేవిస్తున్న సాయిరాం, వినయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3 కిలోల గంజాయి పొడి, 2 స్మార్ట్‌ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేయగా.. మరో నిందితుడు మొద్దు అలియాస్‌ బాయ్‌ పరారీలో ఉన్నాడు. తదుపరి చర్యల కోసం ఇంతేజార్‌గంజ్‌ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ డాక్టర్‌ ఎం.జితేందర్‌రెడ్డి తెలిపారు. ఈదాడుల్లో టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్లు ఎస్‌.వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు, ఎస్‌ఐలు నిస్సార్‌పాషా, వడ్డెబోయిన లవన్‌కుమార్‌తో పాటు పోలీసులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి


రాఘవ(ఫైల్‌)

మహబూబాబాద్‌ రూరల్‌: విద్యుదాఘాతంతో జిల్లా కేంద్రంలోని భక్తమార్కండేయ గుడి సమీపంలో నివాసం ఉండే వరికొప్పుల దుర్గారావు కవిత కుమారుడు రాఘవ(16) బుధవారం మృతి చెందాడు. సాయంత్రం స్థానికంగా నూతనంగా నిర్మిస్తున్న ఓ భవనంపైకి బాలుడు ఎక్కాడు. సమీపంలో ఉన్న విద్యుత్‌ తీగలు గమనించకపోవడంతో ప్రమాదవశాత్తు వాటికి తగిలి విద్యుదాఘాతానికి గురై భవనంపై నుంచి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలైన రాఘవను ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యం అందిస్తుండగానే మృతి చెందాడు.

భార్య కాపురానికి రావట్లేదని ఆత్మహత్య


నరేందర్‌(ఫైల్‌)

కమలాపూర్‌: భార్య కాపురానికి రావడం లేదని కమలాపూర్‌కు చెందిన కోడెం నరేందర్‌ (43) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీస్‌ ఇన్‌స్పెక్టర్‌ బొలిమల్ల సంజీవ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. శనిగరం గ్రామానికి చెందిన తాటిపాముల కొమురయ్య చిన్న కూతురు అరుణతో నరేందర్‌కు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. ఐదేళ్లుగా అత్తగారింట్లో ఉంటున్న నరేందర్‌ కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మూడు నెలలుగా.. కొద్ది రోజులు శనిగరంలో, మరికొద్ది రోజులు కమలాపూర్‌లో తన తండ్రి వద్ద ఉంటూ కూలీ పని చేస్తున్నాడు. గత నెల 23న తమ బంధువుల ఇంట్లో పెళ్లి ఉందని తన భార్యను రమ్మన్నాడు. ఆమె రాలేదు. దీంతో మనస్తాపానికి గురైన నరేందర్‌ బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం నుంచి నరేందర్‌ భోజనం చేయలేదని అతని తండ్రి వెళ్లి చూడగా నరేందర్‌ దూలానికి వేలాడుతూ కనిపించాడు. మృతుడి తండ్రి రాజమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు.

రేవంత్‌రెడ్డి సభకు వెళ్లొస్తుండగా కార్యకర్త మృతి

- మరొకరికి గాయాలు


చందు (ఫైల్‌)

గణపురం: రేవంత్‌రెడ్డి సభకు వెళ్లొస్తుండగా రేగొండ మండలం రామన్నగూడెం తండాకు చెందిన కాంగ్రెస్‌ కార్యకర్త బాదావత్‌ చందు(32) మృతి చెందాడు. చందు, అదే గ్రామానికి చెందిన ఇస్లావత్‌ శ్రీనివాస్‌ మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో రేవంత్‌రెడ్డి జోడో యాత్రకు బైక్‌పై వెళ్లారు. రాత్రి తిరిగి వస్తున్న క్రమంలో అతడి బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో వెనకాల మిర్చిలోడుతో వస్తున్న బొలెరో వాహనంపై ఎగిరి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెనకాల కూర్చున్న శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108లో ఎంజీఎంకు తరలించారు. ప్రస్తుతం శ్రీనివాస్‌ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: కాంగ్రెస్‌

ఎంజీఎం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాంగ్రెస్‌ కార్యకర్త చందు కుటుంబాన్ని, గాయపడిన శ్రీనివాస్‌ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ అంజన్‌కుమార్‌ యాదవ్‌, హనుమకొండ అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. చికిత్స పొందుతున్న ఇస్లావత్‌ శ్రీనివాస్‌ కుటుంబ సభ్యులను బుధవారం కాంగ్రెస్‌ నేతలు ఎంజీఎం ఆస్పత్రిలో పరామర్శించారు. చందు కుటుంబానికి పార్టీ తరఫున రూ.లక్ష తక్షణ సహాయం అందిస్తామని తెలిపారు. ఇందులో భూపాలపల్లి నియోజకవర్గ బాధ్యులు గండ్ర సత్యనారాయణ, జిల్లా మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు మహ్మద్‌ అయూబ్‌, సీనియర్‌ కాంగ్రెస్‌ నేతలు అంకుశ్‌, జిల్లా ఉపాధ్యక్షులు మహ్మద్‌ జమీదొద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి వెళ్లి తిరిగివస్తుండగా..

- స్కూటీ అదుపుతప్పి ఒకరి మృతి


ఎల్లారెడ్డి మృతదేహం

పరకాల: బంధువుల పెళ్లికి వెళ్లి స్కూటీపై తిరిగి వస్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన పరకాల మండలం వెల్లంపల్లి గ్రామశివారులో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వెల్లంపల్లి గ్రామానికి చెందిన అబ్బు ఎల్లారెడ్డి(45) హనుమకొండలో జరిగిన బంధువుల పెళ్లికి తన స్కూటీపై వెళ్లాడు. సాయంత్రం తిరిగి వస్తుండగా వెల్లంపల్లి గ్రామ శివారులో రోడ్డుపై అదుపు తప్పి పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పరకాల పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై కేసు

ఖిలా వరంగల్‌: ప్రేమ పేరుతో ఓ బాలికకు దగ్గరై వేధింపులకు గురిచేస్తున్న ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్‌ ముస్క శ్రీనివాస్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌ రైల్వేగేట్‌ ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఇంటర్మీడియట్‌ చదువుతోంది. వరంగల్‌ శంభునిపేట నాగమయ్య టెంపుల్‌ ఏరియాకు చెందిన సీహెచ్‌.అఖిల్‌(22)కు బాలికతో పరిచయడం ఏర్పడింది. ప్రేమ పేరుతో బాలికకు దగ్గరయ్యాడు. మాయమాటలు చెప్పి ఇంట్లో నుంచి బయటకు తీసుకెళ్లడం.. తన వద్ద ఉన్న బంగారు వస్తువులు లాక్కొని మానసికంగా వేధించడం వంటివి చేస్తున్నాడు. గతంలో అతడిపై మిల్స్‌కాలనీ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయినా అతడి పద్ధతి మారలేదు. మానసికంగా వేధిస్తూనే ఉన్నాడు. బాలిక తండ్రి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అఖిల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

సౌత్‌జోన్‌ ఇంటర్‌ వర్సిటీ చెస్‌ పోటీలకు కేడీసీ విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌

విద్యారణ్యపురి: చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఈనెల 10వ తేదీ నుంచి 12 వరకు సౌత్‌జోన్‌ ఇంటర్‌ యూనివర్సిటీ చెస్‌ టోర్నమెంట్‌ నిర్వహించనున్నారు. ఈటోర్నమెంట్‌కు హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎ.తరుణ్‌, జె.ఉపేందర్‌ ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ జి.రాజారెడ్డి, ఫిజికల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ జె.సోమన్న తెలిపారు. ఈమేరకు బుధవారం ఆ కళాశాలలో ఆయా ఇద్దరు విద్యార్థులను తరుణ్‌, ఉపేందర్‌కు ప్రిన్సిపాల్‌ రాజారెడ్డి పూలబొకేను అందించి అభినందించారు. అనంతరం పోటీల్లో రాణించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆకళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎ.సంజీవయ్య, ఫిజికల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ జె.సోమన్న, అధ్యాపకులు తదితరులున్నారు.

కొరవడిన నిఘా

- జేఎన్‌ఎస్‌లో 14 కెమెరాలకు 8 చోరీ
- ఇంటి దొంగలపై అనుమానాలు?
- వెలుగులోకి వస్తున్న కొన్ని ఘటనలు
- రెండేళ్లయినా పునరుద్ధరణకు నోచుకోని వైనం


హనుమకొండలోని జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియం మెయిన్‌ గేట్‌

వరంగల్‌ స్పోర్ట్స్‌: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ) లో ఇంటి దొంగలున్నారా? అంటే అవుననే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వారి ఘన కార్యాలకు అడ్డొస్తున్నాయని భావించారో ఏమో ఏకంగా సీసీ కెమెరాలనే మాయం చేశారు. సీసీ కెమెరాలు మాయమైన ఘటనపై శాఖలో క్షేత్రస్థాయి విచారణ జరిపి పునరుద్ధరించాల్సిన జిల్లా యువజన, క్రీడల అధికారి ఆదిశగా చర్యలు తీసుకోకపోవడం విశేషం. కెమెరాలు గల్లంతయ్యాక జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో పలు దొంగతనాలు జరిగాయి. ఇతర ఘటనలు చోటు చేసుకున్నాయి. డీఎస్‌ఏ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా గడిచిన రెండేళ్లలో చోరీ జరగడంపై డీఎస్‌ఏ, క్రీడా సంఘాల్లో వారం రోజులుగా చర్చ జరుగుతోంది. డీఎస్‌ఏలో అసలేం జరుగుతుందో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి.

14 సీసీ కెమెరాలకు.. 8 మాయం

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పరిధిలో 2018 జూన్‌ 30న రూ.1.10 లక్షలతో 8 సీసీ కెమెరాలను అప్పటి డీవైఎస్‌ఓ ధనలక్ష్మి ఏర్పాటు చేశారు. అందులో 4 సీసీ కెమెరాలు ఇండోర్‌ స్టేడియంలో, 4 సీసీ కెమెరాలు జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేశారు. జేఎన్‌ఎస్‌లో బిగించిన 4 కెమెరాలు కనిపించకుండా పోయాయి. ఆతర్వాత మార్చి 12, 2019న 2 సీసీ కెమెరాలు ఇండోర్‌ స్టేడియంలోని షటిల్‌ బ్యాడ్మింటన్‌ కోర్టులో, బాలసముద్రంలోని స్విమ్మింగ్‌పూల్‌లో 4 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. 6 సీసీ కెమెరాలకు రూ.48,700లు ఖర్చు అయినట్లు డీఎస్‌ఏ అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అందులో స్విమ్మింగ్‌ పూల్‌లో బిగించిన 4 సీసీ కెమెరాలు కనిపించకుండా పోయాయి.

వెలుగులోకి చోరీ ఘటనలు

- ఆగస్టు 2022 నుంచి ఇండోర్‌ స్టేడియం ఆవరణలో నిలిపిన మూడు సైకిళ్లు చోరీకి గురయ్యాయి.
- నాలుగు నెలల క్రితం ఇండోర్‌ స్టేడియంలో కుమారుడికి షటిల్‌ నేర్పించేందుకు వచ్చిన ఓ వ్యక్తి స్కూటీ డిక్కీలోని రూ.10వేలు ఎత్తుకెళ్లారు.
- కొద్ది రోజుల క్రితం డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్‌ జాగింగ్‌ కోసం బైక్‌పై జేఎన్‌ స్టేడియంకు వచ్చారు. పార్కింగ్‌ చేసిన ఆయన బైక్‌ సీటు, ట్యాంకు కవర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పూర్తిగా చించేశారు.

పునరుద్ధరణపై నిరాసక్తి!

సుమారు నాలుగేళ్ల క్రితం జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో ఓవ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. పోలీసుల సూచనల మేరకు స్టేడియం ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు కీలకమైనప్పటికీ రెండేళ్లలో పలు చోరీలు జరిగినా, సీసీ కెమెరాలు చోరీకి గురైనా ఇప్పటికీ సీసీ కెమెరాల పునరుద్ధరణపై డీవైఎస్‌ఓ నిరాసక్తత చూపడంపై క్రీడాభిమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

భారీ వాహనాలతో కనెక్షన్‌ తెగింది..



అప్పటి డీవైఎస్‌ఓ సీసీ కెమెరాల మానిటరింగ్‌ కోసం ఇండోర్‌ స్టేడియంలో టీవీ ఏర్పాటు చేశారు. ఇండోర్‌ స్టేడియం నుంచి రోడ్డు అవతల ఉన్న జేఎన్‌ స్టేడియంలో ఏర్పాటు చేసిన కెమెరాలకు కనెక్షన్‌ ఇక్కడి నుంచి ఇచ్చారు. బస్టాండ్‌ నుంచి అటుగా వెళ్లే భారీ వాహనాలు కెమెరా తీగకు తగలడంతో కెమెరాలు ఊడిపోయాయి. స్విమ్మింగ్‌ పూల్‌లో కెమెరాలను పునరుద్ధరించేందుకు టెక్నీషియన్‌తో మాట్లాడాను. త్వరలోనే పాతవాటితో పాటు కొత్త కెమెరాలను బిగించనున్నాం.

– గుగులోత్‌ అశోక్‌కుమార్‌, డీవైఎస్‌ఓ, హనుమకొండ